సాక్షి
జోగులాంబ గద్వాల

సోమవారం । 18 । మార్చి । 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-32
(సోమవారం సాయంత్రం)

సహర్ 5-00
(మంగళవారం తెల్లవారుజామున)



తుదిదశకు కోతలు

ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన చెరుకు తోటల కోత చివరి దశకు చేరుకుంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.2 /28.1

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాలికల జట్టుకు మూడోస్థానం



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో జిల్లా బాలికల జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచింది. టోర్నీలో బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచింది. జిల్లా బాలికల జట్టును స్థానిక మెయిన్ స్టేడియంలో జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం అధ్యక్షుడు అమరేందర్‌రాజు, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, సాధిక్‌అలీ, నాగరాజు, రాఘవేందర్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలెం వెంకన్న కల్యాణం

బిజినేపల్లి: పాలెంలో మంగళవారం అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకు డు కొరవి రామానుజచార్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. దశమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పా ట్లు చేశామని.. ఈ వేడుకలో పాల్గొనే దంపతులు ఆలయ నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

వేరుశనగ @ 7,302

కల్వకుర్తి : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో 817 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా.. గరిష్ఠంగా రూ.7,302, కనిష్ఠంగా రూ.5,061, సగటున రూ.6,893 ధరలు వచ్చాయి. మొత్తం 117మంది రైతుల నుంచి వేరుశనగను కొనుగోలు చేసినట్లు మార్కెట్ కార్యదర్శి భగవంతు తెలిపారు.

కమల దళంలో.. కదనోత్సాహం

ప్రధాని మోదీ పర్యటనతో బీజేపీలో జోష్

- సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కదలిన కాషాయదండు
- ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఊపందుకున్న ప్రచారం
- జాతీయ స్థాయి నేతల రాకతో పార్టీలో జోరు
- గెలుపే లక్ష్యంగా శ్రేణులకు దిశానిర్దేశం



సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సమయంలో ఏకంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రంగంలోకి దిగి నాగర్‌కర్నూల్ ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ పర్యటనతో కమలం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభకు పెద్దఎత్తున జనం హాజరుకావడంతో ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సభను చూస్తుంటే బీజేపీ విజయం ఖాయం అయిపోయిందని సైతం వ్యాఖ్యానించారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌తోపాటు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీజేపీ భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఈ సభకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.

బూత్‌ల వారీగా సమీక్ష..

పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో కనీసం 370 చొప్పున ఓట్లు వచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ మేరకు బూత్ అధ్యక్షుడు బాధ్యత వహించి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడంతోపాటు ఓటు బ్యాంకు సంపాదించాలని భావిస్తోంది. తద్వారా తమ పార్టీకి వచ్చే ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుకోవాలని యోచిస్తోంది. ఈ మేరకు ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్‌షా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ల వారీగా వర్కింగ్ గ్రూపులను ఏర్పాటుచేసి వారి ద్వారా ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికీ తీసుకెళ్లనున్నారు. ఒక్కవైపు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం.. మరోవైపు జాతీయ స్థాయి నేతలతో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

గెలుపే లక్ష్యంగా ముందుకు..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే **లోక్‌సభ ఎన్నికల** కోసం బీజేపీ **సన్నాహాలు ప్రారంభించింది**. ఈ ఎన్నికల్లో **తమ అభ్యర్థుల** గెలుపే లక్ష్యంగా **వేగంగా పావులు** కదుపుతోంది. ఈసారి **లోక్‌సభ ఎన్నికల్లో** రాష్ట్రంలో **డబుల్ డిజిట్ సంఖ్యను** దక్కించుకుంటామని **ధీమా వ్యక్తం చేస్తోంది**. నాగర్‌కర్నూల్ **పార్లమెంట్ నియోజకవర్గంలో** సిట్టింగ్ **ఎంపీ రాములును** తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా బీజేపీ తమ బలాన్ని పెంచుకుంది. ఈ క్రమంలో మొదటగా చేరికలపై దృష్టిపెట్టింది. ఎంపీ రాములు వెంట వనపర్తి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సన్నిహితుడు, డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డిని సైతం పార్టీలో చేర్చుకోవడంలో సక్సెస్ అయింది. తాజాగా ప్రధానమంత్రి మోదీ పర్యటనతో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌తో పాటు నల్లగొండ స్థానాల్లో విజయం సాధిస్తామని భావిస్తోంది.

నాగర్‌కర్నూల్‌పై ప్రత్యేక దృష్టి..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎస్సీ రిజర్వ్ స్థానమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంపై బీజేపీ గురి పెట్టింది. ఈ స్థానంలో ఉన్న సిట్టింగ్ ఎంపీని పార్టీలో చేర్చుకోవడంతోపాటు ఇతర పార్టీల నేతల చేరికలపై ప్రధానంగా దృష్టిసారించింది. ఇప్పటివరకు ఈ స్థానంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించకపోగా.. బీజేపీ మాత్రం ముందుగానే ఎంపీ రాములు తనయుడు భరత్‌ప్రసాద్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ కేంద్రంగానే ప్రధాని మోదీతో ఎన్నికల ప్రచార బహిరంగ సభ నిర్వహించింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమకు అనుకూలంగా ఉన్నవి, ప్రతికూలంగా ఉన్న వాటిలో గెలుపోటముల ప్రభావంపై లెక్కలు వేస్తోంది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లో నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి ఎవరన్న దానిపై ఇంకా మీమాంస కొనసాగుతోంది. కాంగ్రెస్‌లో మల్లురవి పేరు ప్రధానంగా వినిపిస్తున్నప్పటికీ మరో నేత సంపత్‌కుమార్ ఈ సీటు కోసం పట్టుబడుతున్నారని తెలుస్తోంది. బీఆర్‌ఎస్ తమ పార్టీ తరఫున ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను రంగంలోకి దింపుతుందా లేక మరో నేతకు అవకాశం కల్పిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి



బీఎం సంతోష్, కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి

గద్వాల రూరల్: భారత ఎన్నికల కమీషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఈనెల 16వ తేదీన షెడ్యూల్ విడుదల చేసినందున జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ ఏప్రిల్ 18వ తేదీన వస్తుందని ఏప్రిల్ 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26వ తేదీన నామినేషన్ల స్క్రూటీని, ఏప్రిల్ 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడుతాయని, జిల్లాలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగనున్నట్లు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. అలంపూర్ నియోకవర్గంలో 290, గద్వాల నియోజకవర్గంలో 303 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 4,94,945మంది ఓటర్లు ఉండగా, ఇందులో 2,43,353 మంది పురుషులు, 2,51,573 మంది మహిళలు, 19మంది ఇతరులు ఉన్నారని, భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.



శాంతినగర్ పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న ఎంఈఓ తదితరులు

సర్వం సిద్ధం

- పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో హాజరుకానున్న 5,669మంది విద్యార్థులు
- మొత్తం 41 పరీక్ష కేంద్రాలు

జిల్లా వివరాలిలా..

పరీక్ష కేంద్రాలు	: 41
విద్యార్థుల సంఖ్య	: 7,377
ఇన్విజిలేటర్ల సంఖ్య	: 401
ఫ్లెయింగ్ స్క్వాడ్‌లు	: 02
చీఫ్ సూపరిండెంట్లు	: 41
డిపార్టుమెంటల్ అధికారులు	: 41
రూట్ ఆఫీసర్స్	: 03
'సీ' సెంటర్స్	: 09

పరీక్ష సమయం : ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు

గద్వాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షలకు మొత్తం 7,377 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 5,669 మంది.. ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు 1,534 మంది ఉన్నారు. ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 174 మంది ఉన్నారు. పది పరీక్ష రాసే వారిలో మొత్తం 3,575 మంది విద్యార్థులు బాలురు కాగా, 3,802 మంది విద్యార్థులు బాలికలున్నారు. పరీక్షలను జంబ్లింగ్ పద్ధతిలోనే నిర్వహిస్తారు.

సీసీ కెమెరాలతో నిఘా

ప్రతి పరీక్ష కేంద్రంలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలోనే ప్రశ్నపత్రాల కవర్లను తెరవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆయా పరీక్ష కేంద్రాలలో ఉన్న సీసీ కెమెరాల పనితీరును అధికారులు పరిశీలించారు. పోలీసు స్టేషన్లకు దూరంగా ఉన్న 'సీ' సెంటర్ల నుంచి ప్రశ్న పత్రాలను తరలించేందుకు పోలీసు ఎస్కార్టుతో ప్రత్యేక వాహనాలను కేటాయించారు. విద్యార్థులు, సిబ్బంది పరీక్ష కేంద్రం లోపలికి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు అనుమతించరు. అదే విధంగా ఎలాంటి ఎల్రక్టానిక్ గాడ్జెస్ తీసుకురావటం నిషేదం. ప్రతి కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. అస్వస్థతకు గురైతే ప్రథమ చికిత్సను అందించేందుకు ఏఎన్‌ఎంను నియమించారు.

పటిష్ట బందోబస్తు

కలెక్టర్ సంతోష్, అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్‌లు సంబంధిత అధికారులతో పది పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పటిష్ట బందోబస్తు మధ్య ప్రశ్న పత్రాలను తరలించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేస్తారు. పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది తప్పని సరిగా గుర్తింపు కార్డు ధరించి ఉండాలి.

అరగంట ముందే చేరుకోవాలి



జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తాం. పరీక్ష సమయానికి అరగంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

– అపూర్వ్‌చౌహాన్, అడిషనల్ కలెక్టర్

ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యం

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు అవసరమైన బస్సులను ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ ఉన్నాతధికారులు ప్రకటించారు. ఇందుకోసం ఉచిత రవాణా సౌకర్యం కల్పించింది. విద్యార్థులు తమ వద్ద ఉన్న పాత బస్‌పాస్, లేదా పదో తరగతి హాల్ టికెట్ చూపించి బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రానికి చేరుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం ఆర్టీసీ ఇప్పటికే రూట్ మ్యాపింగ్ ప్రణాళికను తయారు చేసింది.

పన్ను వసూళ్లకు అడ్డంకులు

- రాజకీయ నాయకులు, కౌన్సిలర్ల సిఫార్సులు
- వంద శాతం వసూళ్ల లక్ష్యం చేరుకోలేక సిబ్బందికి తప్పని తిప్పలు



గద్వాల: 'కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం' అన్న చందంగా తయారైంది మున్సిపల్ అధికారుల పరిస్థితి. పట్టణంలో పన్నుల వసూళ్లకు ఉన్నతాధికారులు లక్ష్యాలు విధించారు. రోజువారి వసూళ్లకు రాజకీయ నేతలు మోకాలడ్డుతున్నారు. ఎవరి దగ్గరకు వెళ్లినా కౌన్సిలర్లు, లేదా పెద్ద రాజకీయ నాయకులతో సిఫార్సులు చేయిస్తున్నారు. లేదా చెల్లించమని బెదిరిస్తున్నారు. దీంతో పన్నులు వసూలు కాక ఉన్నతాధికారులకు సమాధానాలు చెప్పలేక నలిగిపోతున్నారు. ఇదీ జిల్లాలోని గద్వాల, అయిజ మున్సిపాలిటీలలో అధికారుల పరిస్థితి.

సిఫారస్‌ల పర్వం

జిల్లా కేంద్రంలోని ఓ కూడలిలో హోటల్ యజమాని రూ.26వేలు పన్ను చెల్లించాలి. దీన్ని చెల్లించాలని రెవెన్యూ విభాగం సిబ్బంది కోరగా.. 'నా ఇష్టం వచ్చినప్పుడు కడతా.. ఏం చేస్తారో.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి..? మీకు స్థానిక కౌన్సిలర్‌తో ఫోన్ చేయించాలా..' అంటూ ఒక హోటల్ యజమాని సమాధానం చెప్పాడు. మరో ఘటనకు వస్తే.. 'హలో ఆర్‌ఐ గారు. ఆ దుకాణం మావాడిదే. నిదానంగా పన్ను చెల్లిస్తాడులే. కొద్దిగా చూసీ చూడనట్లు వెళ్లు. పన్ను అంత ఎందుకు వచ్చింది. కాస్తా చూసి వేయండి.' ఇదీ గద్వాల, అయిజ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో కౌన్సిలర్లు, పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులు పన్నులు వసూలు చేసే మున్సిపాలిటీ అధికారులకు చేస్తున్న సిఫార్సుల పర్వం.

లక్ష్యం చేరేందుకు మోకాలడ్డు

పన్నుల వసూలు చేసే అధికారులకు, సిబ్బందికి వ్యాపార దుకాణాలు, సంస్థలు నిర్వహిస్తున్న భవన నిర్మాణదారులు పన్నులు చెల్లింపుల్లో మున్సిపాలిటీ అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. మరోవైపు రోజుకు ఎన్ని లక్షలు వసూలు చేశారని పుర ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. మార్చి నెలాఖరుకు బడ్జెట్ రూపొందించుకోవాలి. దీనికి పన్నుల వసూళ్ల రూపంలో వచ్చే ఆదాయమే ప్రధానం. పట్టణంలో ఏ అభివృద్ధి పనులు చేయాలన్నా.. పారిశుద్ధ్యం, తాగునీరు సరాఫరా వంటి సేవలు అందించాలన్నా పన్నులు వసూళ్లు బాగుంటేనే సాధ్యమవుతుంది. కానీ నివాస భవన యజమానులు ఎలాగోలా చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. కొందరు వ్యాపార దుకాణదారులు మాత్రం ససేమిరా అంటున్నారు. చెల్లింపుల్లో రాజకీయ నాయకులు, కౌన్సిలర్లతో సిఫార్సులు చేయిస్తున్నారు. దీంతో పన్నుల వసూళ్లకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

దూకుడు పెంచిన కమీషనర్లు

ఆర్థిక సంవత్సరం మరి కొన్ని రోజుల్లో ముగుస్తోంది. దీంతో పన్నుల వసూళ్లల్లో గద్వాల, అయిజ మున్సిపల్ కమిషనర్లు, అధికారులు దూకుడు పెంచారు. బడాబకాయిదారుల జాబితాను చేతపట్టి నేరుగా దుకాణాలకు వెళ్తున్నారు. ఆస్తిపన్ను చెల్లించే వరకు కట్టు కదలడం లేదు. ఈ క్రమంలో దుకాణాదారులు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. కౌన్సిలర్లు, రాజకీయ నాయకుల సిఫార్సులను పట్టించుకోవడం లేదు. అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహన్ రోజువారి లక్ష్యాలు నిర్దేశిస్తుండటంతో... వారి ఆదేశాల మేరకు పన్ను వసూళ్లలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గడిచిన కొన్ని రోజులుగా పన్ను వసూళ్లల్లో వేగం పెరిగింది.

పాలమూరుకు కార్పొరేషన్ పదవులు

- ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి చైర్మన్‌గిరి
- రాష్ట్రస్థాయిలో కీలక పదవులు రావడంపై హర్షం

వనపర్తి/ కొల్లాపూర్/ కోస్గి: ఉమ్మడి పాలమూరు జిల్లా నేతలకు మరో మూడు కార్పొరేషన్ పదవులు దక్కాయి. ఇందులో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా చింతలపల్లి జగదీశ్వర్‌రావు, స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా శివసేనారెడ్డి నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లా నేతలకు రాష్ట్రస్థాయిలో కీలక పదవులు లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పోలీస్ శాఖ హౌసింగ్ కార్పొరేషన్..



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డిని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఈయన ఉమ్మడి జిల్లాలో సీనియర్ నాయకుడిగా, కొడంగల్ నియోజకవర్గంలో తిరుగులేని నేతగా ఎదిగి.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. 1978, 1983 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికలో ఓటమి పాలయ్యారు. దీంతో హ్యాట్రిక్ తప్పింది. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఆయన గెలిచారు. 2009లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోవడంతో మరోసారి హ్యాట్రిక్ చేజారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి పనిచేశారు. తాజాగా పోలీస్‌శాఖ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

జగదీశ్వర్‌రావుకు నీటిపారుదల శాఖ



కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన చింతలపల్లి జగదీశ్వర్‌రావుకు నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ పదవి వచ్చింది. ఈయనకు గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో జగదీశ్వర్‌రావుకు పార్టీ టికెట్ చేజారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని ప్రస్తుత సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు జగదీశ్వర్‌రావుకు నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ముష్టిపల్లికి చెందిన ఈయన 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావుపై పోటీచేసి, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2012 ఉపఎన్నికలో టీడీపీ నుంచి రెండోసారి పోటీచేసి, ఓడిపోయారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే పార్టీ టికెట్ దక్కలేదు. 2020లో జగదీశ్వర్‌రావు నాయకత్వంలో నిర్వహించిన మన ఊరు–మన పోరు సభ కాంగ్రెస్ పార్టీకి జీవం పోయడంతో ఇప్పుడు ఫలితం దక్కింది.

శాట్ చైర్మన్‌గా శివసేనారెడ్డి



గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్‌ను త్యాగం చేసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవి కట్టబెట్టి, సముచిత స్థానం కల్పించింది. వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన శివసేనారెడ్డి.. ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. ప్రాథమిక విద్యను స్వగ్రామంలోనే పూర్తిచేశారు. విశాఖపట్నంలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేశారు. కాలేజీ లీడర్‌గా రాజకీయాల్లోకి వచ్చారు. 2009లో వైఎస్సార్‌సీపీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఆరంగ్రేటం చేశారు. కొన్నాళ్లకే కాంగ్రెస్ పార్టీలో చేరి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత ఎలక్టెడ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన.. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రలో ఉత్సాహంగా పాల్గొని పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కోటాలో రావాల్సిన టికెట్‌ను త్యాగం చేసిన ఆయనకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

జనరల్ ఆస్పత్రిలో మిల్క్ బ్యాంక్ ఏర్పాటు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ జీవన్, సంస్థ ప్రతినిధులు

పాలమూరు: మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో త్వరలో ధాత్రి మిల్క్ బ్యాంక్ కేంద్రాన్ని ప్రారంభం చేసుకోడానికి కావాల్సిన సదుపాయాలు, వసతుల కోసం పరిశీలిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ వెల్లడించారు. ఈ మేరకు సుషేణ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్‌తో కలిసి ఆదివారం కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ జీవన్ మాట్లాడుతూ మిల్క్ బ్యాంకు ద్వారా నవజాత శిశువులకు మొదటి ఆరు నెలల్లో తల్లి పాలను అందించడం, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడం జరుగుతుందన్నారు. తల్లి పాలు పొందలేని శిశువులకు ధాత్రి మిల్క్ బ్యాంకులో శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేసిన పాలను అందిస్తామని చెప్పారు. అనంతరం ఎన్జీఓ వ్యవస్థాపకుడు డాక్టర్ సంతోష్‌కుమార్ భరద్వాజ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఎన్నో ప్రజారోగ్య సంబంధిత కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. శిశువు యొక్క రోగ నిరోధక సామర్థ్యం, సమగ్ర శారీరక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ధాత్రి మిల్క్ బ్యాంకు కేంద్రాన్ని హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో ప్రారంభించి.. విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గాంధీ ఆస్పత్రి, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నామన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీస్తాం

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం పాలమూరు రెడ్డి సేవా సమితి 22వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చాలామంది పేద రెడ్లు ఉన్నారని, వారి పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాలమూరు రెడ్డి సేవాసమితి సరైన వసతి సౌకర్యం కల్పించేందుకు ముందుకొస్తే.. సీఎంతో ప్రత్యేకంగా మాట్లాడి నాలెడ్జ్ సెంటర్ మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. సమాజంలో డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తులను పెంచితే ఆర్థిక ప్రయోజనం ఉండదని, వ్యవసాయ ఉత్పత్తులైన పాలు, ఆర్గానిక్ ఆహార పదార్థాలకు ఉన్న ప్రాధాన్యతపై పిల్లల్లో అవగాహన కల్పించి, వ్యవసాయంపై ఆసక్తి పెంచుకునేలా చూడాలన్నారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవాసమితికి అవసరమైన సందర్భంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం తనకు ఢిల్లీలో ఒక స్థానం ఇచ్చిందని.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక సలహాదారుడిగా నియమించిందన్నారు. క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం అతిథులను సమితి ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, రెడ్డి హాస్టల్ హైదరాబాద్ అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, ప్రతినిధులు బసిరెడ్డి, వి.మనోహర్‌రెడ్డి, వేపూరు రాజేందర్‌రెడ్డి, మల్లు నరసింహారెడ్డి, ధనుంజయరెడ్డి, వెంకట్రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, విజయసారథిరెడ్డి, దొడ్ల నారాయణరెడ్డి, పట్లోళ్ల లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతమ్మ, స్వరూప, శోభ, వరలక్ష్మి, నర్మద, శశికళ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరి పరిస్థితి విషమం

బిజినేపల్లి: మండలంలోని వెంకటాపూర్ వ్యవసాయ కళాశాల సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. నల్లగొండ జిల్లా సుర్యాపేటకు చెందిన సిద్దార్థ్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం వ్యవసాయ కళాశాల సమీపంలో వీపనగండ్ల మండలానికి చెందిన బాలకృష్ణ నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉమ్మడి నల్లగొండ జిల్లా సుర్యాపేటకు చెందిన అజయ్, సిద్దార్థ్, భరత్ ఎదురుగా వస్తున్నారు. ఈ రెండు ద్విచక్రవాహనాలు ప్రమాదశావత్తు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో సిద్దార్థ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు క్షతగాత్రుల్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవెల్లి: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ నెల 15న మండలంలోని అలంపూర్‌చౌరస్తా బ్రిడ్జి వద్ద డీసీఎంను వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో మండల కేంద్రానికి చెందిన మురళీధర్‌రెడ్డి గాయపడ్డాడు. ఆయనను కర్నూల్‌లోని ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. కుమారుడు అరవింద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మరొకరు..

పెబ్బేరు రూరల్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన వనపర్తి మండలం నాచహళ్లిలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి వివరాల మేరకు.. నాచహళ్లికి చెందిన సాయిలు (54) గ్రామశివారులోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతై మృతిచెందాడు. మృతుడి భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడికి రిమాండ్

గోపాల్‌పేట: పాఠశాలలో టీవీ, అదేకాలనీలో బైక్ చోరీ చేసిన యువకుడిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 16న ఎల్ఈడీ టీవీ, అదేరోజు అదేకాలనీలో బైక్ చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా జనార్దన్ అనే యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో తమదైన శైలిలో విచారించారు. టీవీ, బైక్ తానే ఎత్తుకెళ్లానని, వీటితోపాటు కొన్నిరోజుల కిందట బండపల్లి పాఠశాలలో ట్యాబ్‌కూడా తానే తీసుకువెళ్లానని చెప్పాడు. వాటిని స్వాధీనం చేసుకొని యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

తగ్గుతున్న నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుంది. ఆదివారం 1,013 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం రామన్‌పాడు జలాశయం నుంచి 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

శెభాష్ హర్షిత

- చిన్న వయసులోనే అద్భుత ఆవిష్కృతం
- తల్లిదండ్రుల కష్టం చూడలేక సృజనాత్మకతకు పదును
- తక్కువ ఖర్చుతో కలుపు నివారణ యంత్రం తయారీ
- రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక
- వెన్నాచేడ్ మోడల్ స్కూల్ విద్యార్థిని హర్షిత ఘనత



వేరుశనగ పంటలో కలుపు తీస్తున్న హర్షిత

గండీడ్: తను పేదింటి బిడ్డ.. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆ బాలిక.. చదువుకుంటూనే పొలం పనులకు వెళ్తూ, తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేది. వ్యవసాయంలో వారు పడుతున్న కష్టాన్ని చూడలేక, తనలోని సృజనాత్మకతకు పదునుపెట్టింది. చిన్న వయసులోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. రైతాంగానికి పనికి వచ్చే అద్భుతాన్ని ఆవిష్కరించింది. తక్కువ సమయంలో కలుపుతీసే యంత్రాలను తయారీచేసి, అందరి మన్ననలు అందుకుంటోంది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని వెన్నాచేడ్ గ్రామానికి చెందిన దోమ వెంకట్రాములు, లావణ్య దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కూతురు హర్షిత వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. చదువులో చక్కటి ప్రతిభ కనబరుస్తున్న హర్షిత.. తన మదిలో మెదిలిన ఆలోచనకు పదునుపెట్టి, కొత్తరకం కలుపు నివారణ యంత్రాల తయారీకి శ్రీకారం చుట్టింది.

రైతులకు ఊరట..

ప్రస్తుతం కూలీల కొరత వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా వేధిస్తోంది. కూలి రేట్లు పెరగడమే కాక, కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి, పొలం పనులు చేయించుకుంటున్నారు. ఈక్రమంలో సెలవు దినాల్లో తల్లిదండ్రులతో పాటు హర్షిత పొలం పనులకు వెళ్లేది. నాటు వేయడంతో పాట కలుపు తీయడానికి తనవంతు సహకారం అందించేది. తల్లి అంగన్‌వాడీలో ఆయాగా విధులు నిర్వహిస్తుండగా, తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వ్యవసాయంలో తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూడలేక హర్షిత తన బుర్రకి పదును పెట్టింది. తక్కువ ఖర్చుతో కలుపుతీసే యంత్రాన్ని రైతు లోకానికి పరిచయం చేసింది. హర్షిత రూపొందించిన కలుపు నివారణ యంత్రాలు రైతులకు ఊరటనిస్తున్నాయి.

సొంత పరిజ్ఞానంతో..

ఉపాధ్యాయుడు గోపినాథ్ సహకారంతో మొదట కలుపు నివారణ యంత్రాన్ని పాఠశాల స్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ ప్రోగ్రాంలో ప్రదర్శించగా.. జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికై ంది. దీంతో హర్షితకు రూ.10 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. వచ్చిన డబ్బుతో మిగతా పంటల్లో కూడా కలుపు నివారణకు యంత్రాలు తయారుచేయాలని సంకల్పించింది. అందులో భాగంగానే పత్తి, వేరుశనగ, రాగులు, జొన్న పంటల్లో కలుపుతీసే యంత్రాలను రూపొందించింది. దీన్ని ద్వారా 2 గంటల్లో ఎకరా పొలంలో కలుపు తీయొచ్చు. అందుకు కూలీలను వినియోగిస్తే, తక్కువలో తక్కువ రూ. 6వేల వరకు ఖర్చవుతుంది. అన్నింటికీ ఒకే హ్యాండిల్ పని కొచ్చేలా తయారుచేసి, ఆయా పంటల్లో బ్లేడ్లు మార్చుకుని, కలుపు తొలగించే విధంగా సొంత పరిజ్ఞానంతో రూపొందించింది. ఇవి ఒక్కసారి తయారు చేసుకుంటే, 10–15 ఏళ్ల వరకు పాడవ్వవు. అంటే ఒక్కసారి పెట్టిన పెట్టుబడితో ఎంత ఆదా పొందవచ్చో ఇట్టే అర్థం అవుతుంది. ఏదేమైనా సన్న, చిన్నకారు రైతులకు ఈయంత్రం ప్రయోజనకరంగా ఉండటం విశేషం. ప్రస్తుతం హర్షిత తయారుచేసిన మల్టీ క్రాప్ వీడ్ రిమూవర్ (బహుళ కలుపు నివారణ యంత్రాలు) రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైంది.

మానాన్న పడ్డ ఇబ్బందిని చూశా..



పొలంలో కలుపు తీయడానికి మానాన్న బాగా ఇబ్బంది పడ్డాడు. కూలీల కోసం పడరాని పాట్లు పడ్డాడు. అనారోగ్యం కారణంగా తను పూర్తిస్థాయిలో పొలం పనులు చేయలేకపోతున్నాడు. కలుపు నివారణకు కూలీల అవసరం లేకుండా ఏదైనా తయారుచేయాలని పలు విధాలుగా ఆలోచించా. ఈవిషయాన్ని మానాన్నకు చెప్పగా, అందుకు అవసరమైన రూ.2 వేలను ఇచ్చారు. దాంతో కలుపు నివారణ యంత్రం తయారీకి శ్రీకారం చుట్టాను. ఇందుకు మా ఉపాధ్యాయుడు గోపినాథ్ సహకరించారు. రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. జాతీయ స్థాయిలో రాణించి, సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులు తొలగించాలన్నదే నా సంకల్పం.

– దోమ హర్షిత, పదోతరగతి, మోడల్ స్కూల్, వెన్నాచేడ్

చిన్న వయసులో అద్భుత ఆలోచన..



పాఠశాల స్థాయిలోనే ఇలాంటి అద్భుత ఆలోచనలు రావడం హర్షణీయం. వ్యవసాయంలో ఇబ్బందులు, తల్లిదండ్రులు పడ్డ కష్టాలను గుర్తించిన విద్యార్థిని హర్షిత తన ఆలోచనలకు పదును పెట్టింది. ఇందుకు నావంతు సహకారం అందించాను. విద్యార్థులు సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తే, కొత్త రకం జ్ఞానం బోధపడుతుంది. ఇలాంటి వారికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తే, మరింతగా రాణించే అవకాశం ఉంటుంది.

– గోపినాథ్ ఉపాధ్యాయుడు, మోడల్ స్కూల్, వెన్నాచేడ్

సులభంగా కలుపు నివారణ..

విద్యార్థిని హర్షిత మొదటగా తల్లిదండ్రుల వద్ద రూ.2 వేలు తీసుకుని.. చెక్క, వెదురు బొంగులు, మొలలు, బైండింగ్ వైరుతో కలుపు నివారణ యంత్రాన్ని తయారుచేసింది. దీంతో ఒక గంటలోనే ఎకరా పొలంలో కలుపుతీసింది. మామూలుగా అయితే ఎకరా కలుపు తీయడానికి సుమారు 8 మంది కూలీలు అవసరమవుతారు. ఇందుకు రూ. 4వేల వరకు ఖర్చవుతాయి. పైగా రోజంతా సమయం పడుతుంది. కలుపు నివారణ యంత్రంతో ఒక్కరే గంట సేపట్లో ఎకరా పొలంలో కలుపు తీయొచ్చు. దీనివల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. గతేడాది దీన్ని తయారు చేసి, వారి పొలంతో పాటు పక్క పొలాల్లో సైతం వినియోగిస్తున్నట్లు హర్షిత పేర్కొంది.

తనిఖీలు షురూ..

- వనపర్తి జిల్లావ్యాప్తంగా నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు
- రూ.50 వేల కంటే ఎక్కువ నగదుతో ప్రయాణిస్తే ఆధారాలు తప్పనిసరి

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన గంటల వ్యవధిలోనే పోలీస్ యంత్రాంగం జిల్లా నలువైపులా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో తనిఖీలు ముమ్మరం చేసింది. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే జాతీయ రహదారిపై పెద్దమందడి మండలం వెల్టూరు స్టేజీ, పెబ్బేరు మండలం రంగాపూర్, గోపాల్‌పేట మండలం బుద్దారం గండి, అమరచింత మండలం నాగల్‌కడ్మూర్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఆదివారం మధ్యాహ్నం నుంచే తనిఖీలు ప్రారంభించారు.



పెద్దమందడి మండలం మోజర్ల వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మద్యం, డబ్బుల రవాణాపై ప్రత్యేక నిఘా..

రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా డబ్బులు, మద్యం పెద్దఎత్తున రవాణా కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ జె.వెంకటేశ్వరరావు తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనల మేరకు ఓ వ్యక్తి రూ.50 వేలకు మించి నగదును ఒకచోట నుంచి మరోచోటుకు తీసుకెళ్లరాదని.. ఒకవేళ ఎక్కువ మొత్తం నగదుతో ప్రయాణిస్తే వాటికి సంబంధించిన ఆధారాలు విధిగా కలిగి ఉండాలన్నారు. లేదంటే నగదును సీజ్ చేసి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుల కమిటీకి అప్పగించనున్నట్లు చెప్పారు. సరైన లెక్కలు చూపిస్తే నగదు తిరిగి అప్పగిస్తారని.. లేదంటే ఎన్నికల కమిషన్ ఆధీనంలోకి వెళ్తుందని డీఎస్పీ వెల్లడించారు.

ఆత్మహత్య ఘటనలో ముగ్గురిపై కేసు

- అచ్చంపేట ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యుల ఆందోళన



హరికృష్ణ(ఫైల్)

బల్మూర్: ప్రేమించిన యువతికి వేరొకరితో పెళ్లి నిశ్చయం కావడంతో మండల కేంద్రాని చెందిన డ్యాగ హరికృష్ణ (25) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆదివారం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఈనెల 10న హరికృష్ణ తాను ప్రేమించిన యువతికి బలవంతంగా పెళ్లి నిర్ణయించడంతో మనస్తాపంతో పురుగు మందు తాగడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందటంతో మొదట ఆత్మహత్య కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని అదేరోజు రాత్రి పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పోస్టుమార్టం అడ్డుకున్న కుటుంబసభ్యులు

ఈ ఘటనలో మృతుడు తన ఆత్మహత్యకు ముందు రాసిన నాలుగు పేజీల సూసైడ్ నోట్ కుటుంబసభ్యులకు లభించింది. అందులో తాను ప్రేమించిన యువతి తల్లిదండ్రులు, వారి బంధువు పవన్‌తో పాటు మరో వ్యక్తి తనను బెదిరించారని, వారి వల్లే నేను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో వారిపై ఎఫ్ఐఆర్ చేయాలని మృతుడి తల్లిదండ్రులతో పాటు బంధువులు పోస్టుమార్టం చేయకుండా అడ్డుకోని ఆందోళనకు దిగారు. ఈ మేరకు సూసైడ్ నోట్‌లో పేర్లు ఉన్న యువతి తల్లిదండ్రులతో పాటు బావ పవన్‌లపై కేసు నమోదు చేయడంతో వారు శాంతించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.



ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగిన కుటుంబసభ్యులు

గుడిసె దగ్ధం



ధరూరు: చేపల అమ్మకాలు, చేప వంటకాల కోసం ఏర్పాటు చేసుకున్న ఓ గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నందిమళ్లకు చెందిన మునుస్వామి ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద ఓ గుడిసెను ఏర్పాటు చేసుకొని చేపల విక్రయం, చేప వంటకాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే శనివారం గుడిసెను మూసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి కాలిపోయి కనిపించింది. కావాలని నిప్పంటించారా లేక ప్రమాదవశాత్తు కాలిపోయిందా అనేది తెలియాల్సి ఉంది. గుడిసెలో ఉన్న వంటసామగ్రితో పాటు ఫ్రిజ్, కూల్‌డ్రింక్స్ పూర్తిగా కాలిబూడిదయ్యాయి. బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చానని.. ఇలా జరగడంతో తన కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

వ్యవసాయ సామగ్రి..

తెలకపల్లి: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం సమీపంలో కుమ్మరి వాముల దగ్గర ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఎద్దుల బండి, వ్యవసాయ సామగ్రి, కట్టెలు కాలి బూడిదయ్యాయి. కాలనీవాసులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. చుట్టుపక్కల ఇళ్లు, ఇతర సామగ్రికి వ్యాపించకుండా మంటలను అదుపుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

నేను.. కిడ్నాప్ కాలేదు

- పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

జడ్చర్ల: తాను కిడ్నాప్ అయ్యానంటూ తన భార్య చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని బాలానగర్ పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం తాను వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంట్లో చెప్పకుండా వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో బాలానగర్ సింగిల్‌విండో చైర్మన్‌పై కొందరు డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో తనను కిడ్నాప్ చేశారని తన భార్య అపోహపడి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. శనివారం చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోవడం.. ఇదే సమయంలో తన పనులను ముగించుకుని ఇంటికి వచ్చానన్నారు. తనను కిడ్నాప్ చేశారంటూ సింగిల్‌విండో చైర్మన్ ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో తాను పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే కేసు నమోదైందని.. శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలాన్ని రికార్డు చేసి, కోర్టు దృష్టికి తీసుకెళ్తామని సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు. శ్రీకాంత్‌రెడ్డి వెంట బీఆర్ఎస్‌కు చెందిన జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ఇమ్మూ, మురళి ఉన్నారు.

అదుపుతప్పి బస్సు బోల్తా



బోల్తాపడిన బస్సు

బాలానగర్: ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటన మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారి–44పై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, డ్రైవర్ ప్రకాష్ తెలిపిన వివరాలు ఇలా.. ఓ కంపెనీకి చెందిన కొత్త బస్సు జహీరాబాద్ నుంచి తమిళనాడుకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోయి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఒకరికి, డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే బస్సు అదుపుతప్పి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి డ్రైవర్ నుంచి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, బస్సుకు చెందిన వారు ఎవరూ రాలేదని తెలిపారు.

విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో ఉద్యోగి మృతి

పెబ్బేరు రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన వనపర్తి మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన ఖలీల్(43) వనపర్తి జిల్లా కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రాలలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేసే విభాగంలో పనిచేస్తున్నాడు. ఆదివారం వనపర్తి మండలంలోని పెద్దగుడెంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తున్న క్రమంలో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పరామర్శించిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి జిల్లా ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంభానికి విద్యుత్ శాఖ తరపున అందజేయాల్సిన సహాయసహకారాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు.

తుదిదశకు కోతలు



నాగల్‌కడ్మూర్ శివారులో చెరుకు కోతలు చేపడుతున్న కార్మికులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో 7 వేల ఎకరాల్లో చెరుకు సాగు

- ఇప్పటికే 2.78 లక్షల టన్నులు పూర్తి..
- ఇంకా 16 వేల టన్నులు వచ్చే అవకాశం
- రైతులకు రూ.70 కోట్ల చెల్లింపులు
- 22వ తేదీ నాటికి కోతలు పూర్తయ్యే అవకాశం



కోసిన పంటను లారీలో ఫ్యాక్టరీకి తరలింపు

అమరచింత: కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ఈ నెల 22 నాటికి చెరుకు కోతలు పూర్తి చేసేందుకు యాజమాన్యం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈసారి ఫ్యాక్టరీ పరిధిలో 7 వేల ఎకరాల్లో చెరుకు సాగు చేయగా.. కోతల కోసం ఆంధ్రప్రదేశ్‌లోని ఎర్రగుంటపాలెం, మహారాష్ట్ర నుంచి 140 కోత కార్మికుల బ్యాచ్‌లతో పాటు 10 కోత యంత్రాలను ఏర్పాటు చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయ డానికి సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు 2.78 లక్షల టన్నుల పంట గానుగ ఆడించినట్లు యాజమాన్యం వెల్లడించింది. ఉమ్మడి జిల్లాలోని అమరచింత, ఆత్మకూర్, నర్వ, మక్తల్, కొత్తకోట, నాగర్‌కర్నూల్, శాంతినగర్, గద్వాల, పెబ్బేరు, ఎర్రవల్లితో పాటు కర్నూలు ప్రాంతంలో చెరుకు సాగు చేస్తున్నారు.

ఇబ్బందులు కలగకుండా..

చెరుకు సాగుచేసిన రైతులు కోతల సమయంలో ఇబ్బందులు కలగకుండా యాజమాన్యం సకాలంలో కోత కార్మికులకు రప్పించింది. వీరితో పాటు పది కోత యంత్రాలను వినియోగించి కోసిన పంటను ఫ్యాక్టరీకి తరలించేందుకు కృషి చేస్తోంది. అదేవిధంగా ప్రాంతాల వారీగా చెరుకు సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బందితో క్రమపద్ధతిలో రైతుల వివరాలు సేకరించి కోత కార్మికులను పంపడంతో సకాలంలో కోతలు పూర్తయ్యే అవకాశం కలిగిందని ఫ్యాక్టరీ ఏజీఎం వివరించారు.

రూ.70 కోట్లు చెల్లింపు..

ఫిబ్రవరి 10వ తేదీ నాటికి చెరుకు పంట విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.70 కోట్లు జమ చేసినట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం తెలిపింది. పంటను ఫ్యాక్టరీకి తరలించిన పదిరోజుల వ్యవధిలోనే డబ్బులను రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. మిగిలిన వారికి కూడా పూర్తిస్థాయిలో అనుకున్న సమయానికి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

రైతులకు ప్రోత్సాహం..

చెరుకు రైతులకు 2.50 టన్నుల విత్తనం, చెరుకు మొక్కలను పూర్తి రాయితీపై ఇస్తున్నారు. దీంతోపాటు కొత్తగా పంట సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.12 వేల విలువైన డ్రిప్ ఏర్పాటుకు వందరోజుల వ్యవధిలో చెల్లిస్తున్నారు. అదేవిధంగా కౌలు రైతులకు సైతం రూ.10 వేలు పది శాతం వడ్డీతో అందిస్తున్నారు. వీటితోపాటు కేన్ హెడ్ ద్వారా ఎరువులు, పురుగు మందులు అందజేస్తున్నారు.

మారిన పరిస్థితులు..

నాలుగేళ్ల కిందట ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగుచేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సకాలంలో కోతలు కాకపోవడం, డబ్బుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో చెరుకు సాగును రైతులు పూర్తిస్థాయిలో వదులుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రారంభంలో 15 వేల ఎకరాల్లో పంట సాగు చేయగా.. ప్రస్తుతం 7 వేల ఎకరాలకు పడిపోయింది. అనంతరం ఫ్యాక్టరీ యాజమాన్యం చొరవ చూపడం, చెరుకు రైతులు కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలుదఫాలు చర్చలు జరపడంతో ప్రస్తుతం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కోతలు, తరలింపు, చెల్లింపులు జరుగుతున్నాయి.

15 రోజుల్లో డబ్బులు చెల్లించారు..



2.50 ఎకరాల్లో చెరుకు పంట సాగుచేశా. డిసెంబర్ చివరి నాటికి కోతలు పూర్తయ్యాయి. గతంలో డబ్బుల కోసం ఫ్యాక్టరీ చుట్టూ తిరిగేవాళ్లం. ప్రస్తుతం పంటను ఫ్యాక్టరీకి తరలించిన 15 రోజుల వ్యవధిలోనే డబ్బులు బ్యాంకు ఖాతాలో జమచేశారు.

– రవికుమార్, చెరుకు రైతు, సింగంపేట

పలు దఫాలు విన్నవించాం..



ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెరుకు రైతుల సమస్యలపై పలు దఫాలు విన్నవించాం. కోత ఛార్జీలు తగ్గించడమే కాకుండా లేబర్ ఛార్జీలు రైతులపై వేయొద్దని సూచించాం. రైతులకు ప్రత్యేక రాయితీలు అందించి సాగు విస్తీర్ణం పెంచాలని కోరాం.

– నారాయణ, జిల్లా కోశాధికారి, కృష్ణవేణి చెరుకు రైతు సంఘం

సకాలంలో చెల్లింపులు..

రైతులు తమ పంటను ఫ్యాక్టరీకి తరలించిన 15 రోజుల వ్యవధిలోనే వారికి చెల్లించాల్సిన డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నాం. కోతలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా కార్మికులను రప్పించాం. ఈ నెల 22 నాటికి కోతలు పూర్తిచేసి రైతులకు డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పాండురంగారావు, ఏజీఎం, కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ

క్లుప్తంగా...

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా బాబు, వెంకన్న

ఖమ్మం మయూరి సెంటర్: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.బాబు, ఈదురు వెంకన్న ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న ఈయూ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె.పద్మాకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండీ అహ్మద్‌అలీ, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకట్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శులుగా పాటి అప్పారావు, జె.రాఘవ, ప్రచార కార్యదర్శిగా సి.శంకర్, కోశాధికారిగా జి.డి.ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 36 మందితో రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకన్న మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నూతన కమిటీ పని చేస్తుందన్నారు. ఈ సభలకు రాష్ట్రంలోని 95 డిపోల నుంచి 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై గీత కార్మికుడి హఠాన్మరణం



చెట్టుపై తలకిందులైన వెంకన్నను కిందకి దించుతున్న గీత కార్మికులు

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లాలో ఓ గీత కార్మికుడు తాటిచెట్టుపైనే గుండెపోటుతో మృతిచెందాడు. తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్నగౌడ్ (40) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం వెంకన్నగౌడ్ రోజూ మాదిరిగా కల్లు తీసేందుకు గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కాడు. వెంకన్న చెట్టు పైభాగానికి ఎక్కగానే అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో తలకిందులయ్యాడు. తోటి గీత కార్మికులు ఇది గమనించి అతడిని కిందకి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు.

నృసింహస్వామి పెళ్లికొడుకాయెనే..

యాదగిరిగుట్టలో వైభవంగా స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం ● నేటి రాత్రి శ్రీస్వామి కల్యాణోత్సవం



ఆదివారం రాత్రి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎదుర్కోలు మహోత్సవాన్ని జరిపిస్తున్న ఆలయ ఆచార్యులు



స్వామివారికి పట్టువస్త్రాలను తీసుకొస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవీదేవి, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి శ్రీస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవాన్ని ఆలయ ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా జరిపించారు. ఉదయం ప్రధానాలయ మాడ వీధుల్లో శ్రీస్వామి వారు జగన్మోహిని అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక సాయంత్రం శ్రీస్వామి వారు అశ్వవాహనంపై పెండ్లి కొడుకుగా, ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై అమ్మవారిని సేవోత్సవంగా ఆలయ మాడవీధిలో ఊరేగించారు. అనంతరం ఆచార్యులు, అధికారులు స్వామి వారి పక్షాన, అమ్మవారి పక్షాన చేరి గుణగణాలను చర్చించుకున్నారు. శ్రీనృసింహస్వామికి లక్ష్మీదేవితో వివాహం జరిపేందుకు ముహూర్తాన్ని ఆచార్యులు నిర్ణయించారు.

గజవాహనంపై కల్యాణోత్సవానికి..

తిరుకల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి 8.45 గంటలకు గజవాహనంపై శ్రీస్వామి, ప్రత్యేక పల్లకిపై అమ్మవారు ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ 9.15 గంటలకు ఉత్తర దిశలోని రథశాల ముందు ఏర్పాటు చేసిన కల్యాణ మండపానికి చేరుకుంటారు. ఆ తరువాత శ్రీస్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకను ఆచార్యులు, వేద పండితులు పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం వేద మంత్రాలతో ప్రారంభిస్తారు. తుల లగ్న ముహూర్తంలో రాత్రి 9.37 గంటలకు శ్రీస్వామి వారు అమ్మవారికి మాంగళ్యధారణ చేయనున్నారు. ఇక ఉదయం శ్రీస్వామి వారు శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై ఊరేగనున్నారు.

యాదాద్రీశుడి కల్యాణానికి టీటీడీ పట్టువస్త్రాలు

శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవాలకు టీటీడీ తరఫున ఆదివారం పట్టు వస్త్రాలను అందజేశారు. ఉదయం టీటీడీకి చెందిన ఉప కార్యనిర్వహణాధికారి లోకనాథం మేల్చాట్ పట్టు వస్త్రాలను తీసుకొని, ఆలయ మాడ వీధిలో ఊరేగింపుగా వచ్చారు.జగన్మోహిని అలంకార సేవ ముందు పట్టు వస్త్రాలను ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులకు అందజేశారు.

యాదాద్రి స్వామికి వాహన సేవలు బహూకరణ



మహా బలిపురం నుంచి తీసుకువచ్చిన వాహనాలు

యాదగిరిగుట్ట: శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి సేవోత్సవంలో వినియోగించే వాహన సేవలు బంగారుమయంగా మారనున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ దాత గజ, గరుడ, శేష వాహనాలను పంచ లోహంతో తయారు చేయించి ఆదివారం యాదాద్రి ఆలయానికి తీసుకువచ్చారు. తమిళనాడులోని మహాబలిపురంలో రవీంద్రన్ స్థపతి ఆధ్వర్యంలో ఈ వాహనాలు ప్రత్యేకంగా రూపుదిద్దుకున్నాయి. వీటిని శిల్పులు యాదాద్రికి తీసుకురావడంతో ఆలయ ప్రధానార్చకులు పరిశీలించారు. ఆయన సూచనల మేరకు గజ, గరుడ, శేష వాహన సేవలను తిరిగి మహాబలిపురం తీసుకెళ్లి, బంగారు తాపడం పనులు చేయనున్నట్లు తెలిసింది. 20 రోజుల తరువాత దాత..ఆలయాధికారులు, ఆచార్యులకు అందజేయనున్నట్లు సమాచారం.

కువైట్‌లో మళ్లీ క్షమాభిక్ష అమలు

- జూన్ 17 వరకు 90 రోజుల పాటు చాన్స్
- జరిమానా, జైలు శిక్ష లేకుండా సొంతూరికి వెళ్లడానికి అవకాశం

మోర్తాడ్(బాల్కొండ): వీసా గడువు ముగిసిపోయినా చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారులు వారి సొంత గడ్డకు వెళ్లడానికి కువైట్ ప్రభుత్వం ఆమ్నెస్టీ (క్షమాభిక్ష)ని ప్రకటించింది. ఆదివారం మొదలైన క్షమాభిక్ష.. జూన్ 17వ తేదీ వరకు కొనసాగనుంది. చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారులు తమ దేశాలకు వెళ్లిపోవడానికి కువైట్‌లోని ఎంబసీల్లో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. కరోనా సమయంలో క్షమాభిక్ష అమలు చేయగా, నాలుగేళ్ల విరామం తర్వాత మరోసారి ఆమ్నెస్టీని ప్రకటిస్తూ కువైట్ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. కువైట్‌లో వివిధ దేశాలకు చెందిన వలసదారులు 1.65 లక్షల మంది ఉన్నారని అంచనావేస్తున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల కార్మికులు సుమారు 15 వేల మంది వరకు ఉంటారని కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. కరోనా సమయంలో 2020లో అమలు చేసిన అమ్నెస్టీతో భారీ సంఖ్యలో కార్మికులు ఇంటిబాట పట్టారు. ఇప్పుడు మరోసారి క్షమాభిక్ష అమలు చేస్తుండటంతో పెద్ద సంఖ్యలోనే వలస కార్మికులు సొంతగడ్డకు చేరుకునే అవకాశం ఉందని అంటున్నారు. క్షమాభిక్ష అమలు చేసిన సమయంలో వీసా గడువు ముగిసినవారు ఎలాంటి జరిమానా చెల్లించకుండా, జైలు శిక్ష అనుభవించకుండానే ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుంది.

'రావి' విగ్రహ నమూనా చిత్రానికి ఆమోదం



భువనగిరి రూరల్: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు రావి నారాయణరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటుకు సంబంధించి రూపొందించిన నమూనా చిత్రానికి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆమోదం తెలిపింది. ఆదివారం యాదాద్రి జిల్లా భువనగిరి మండలంలోని బొల్లెపల్లిలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ నమూనా కోసం భువనగిరి జోత్స్న వేసిన చిత్రాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కుటుంబ సభ్యుల వద్ద ఉన్న ఫొటోల ఆధారంగా, రావి నారాయణరెడ్డి సమకాలికుల సలహాలు, సూచనల ద్వారా మెరుగులు దిద్ది రావి ఆకృతిని చిత్రించినట్లు జోత్స్న తెలిపారు. జూన్ 4న రావి నారాయణరెడ్డి జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు మొదట ప్రకటించినా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అదేరోజు రానుండడంతో విగ్రహ ఆవిష్కరణ తేదీని వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి రావి సుఖేశ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రావి ప్రభాకర్ రెడ్డి, చెరుకుపల్లి మహేశ్, రావి హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వడగళ్లవానతో భారీ నష్టం

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 26,129 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- రేకుల షెడ్డు కూలి రెండు ఆవులు, నాలుగు దూడల మృత్యువాత

సాక్షి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చింది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయి. కామారెడ్డి జిల్లాలో 15 మండలాల్లోని 130 గ్రామాల్లో 20,071 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో 14,553 మంది రైతులు నష్టపోయారని నివేదికలో పేర్కొన్నారు. వరి 16,298 ఎకరాల్లో, మక్క 2,784.16 ఎకరాల్లో, జొన్న 705.2 ఎకరాల్లో, గోధుమ ఐదు ఎకరాల్లో, ఉల్లిగడ్డ 12 ఎకరాలు, బొప్పాయి పది ఎకరాలు, పొగాకు 20 ఎకరాలు, మామిడి 192 ఎకరాలు, కూరగాయలు 45 ఎకరాల్లో దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామంలో గాలిదుమారానికి రేకుల షెడ్డు కూలిపోవడంతో అందులో ఉన్న రెండు ఆవులు, నాలుగు దూడలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరోనాలుగు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో 6,058 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పది మండలాల్లోని 44 గ్రామాల్లో వడగళ్ల బీభత్సం సృష్టించాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. 3,076 మంది రైతులు నష్టపోయారన్నారు. అత్యధికంగా 5,661 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. 292 ఎకరాల్లో మక్క, 93 ఎకరాల్లో జొన్న, 12 ఎకరాల్లో నువ్వుల పంట దెబ్బతిన్నదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.



కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మైలారంలో నేలవాలిన వరి పంటను చూపుతున్న రైతు

ఎండ రాకుండానే శ్లాబ్ వేద్దామని వెళుతూ..

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. చికిత్స పొందుతూ మరొకరు
- ముగ్గురూ తాపీ పనులు చేసేవారే..

కోరుట్ల: తెల్లవారక ముందే ముగ్గురి బతుకులు తెల్లారిపోయాయి. ఎండ ముదరక ముందే శ్లాబ్ వేసే పనులు పూర్తి చేయాలన్న ఆత్రుత లారీ రూపంలో వారిని బలిగొంది. స్థానికులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఒంగోలు జిల్లా కొండసముద్రం గ్రామానికి చెందిన బడికెల వేణుగోపాల్(32) తల్లిదండ్రులు జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు–ముత్యంపేట గ్రామానికి 25 ఏళ్ల క్రితం వలస వచ్చారు. తాపీమేస్త్రీ అయిన వేణుగోపాల్ మెట్‌పల్లిలోని ఓ ఇంటి నిర్మాణానికి శ్లాబ్ వేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఆ పనులు చేసేందుకు తను నివసించే గ్రామానికి చెందిన కూలీలు పసులోటి శ్రీకాంత్(26), కొమురం వెంకటేశ్(34)లను తీసుకొని మోటార్‌సైకిల్‌పై ఆదివారం వేకువజామున 4.30 గంటలకు మెట్‌పల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో ఉదయం 5.45 గంటలకు మోటార్‌సైకిల్‌పై కోరుట్ల మండలం మోహన్‌రావుపేట్ శివారు దాటుతుండగా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెనుక కూర్చున్న పసులోటి శ్రీకాంత్, కొమురం వెంకటేశ్ ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న వేణుగోపాల్ తీవ్రంగా గాయపడి కొనఊపిరితో ఉండగా, పోలీసులు జగిత్యాల ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు.



వేణుగోపాల్, శ్రీకాంత్, వెంకటేశ్ (ఫైల్)

ఘటనాస్థలాన్ని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కోరుట్ల, మేడిపల్లి ఎస్‌ఐలు కిరణ్, శ్యాంరాజ్, శ్వేత పరిశీలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీతో పరారయ్యాడని, నంబరు ఆధారంగా రాజస్తాన్‌కు చెందిన లారీగా గుర్తించామని సీఐ తెలిపారు. వేణుగోపాల్‌కు భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉండగా, శ్రీకాంత్ భార్య శిరీష 7 నెలల గర్భిణి కావడంతో మృతుల బంధువర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వెంకటేశ్‌కు బంధువులెవరూ లేకపోవడంతో కోరుట్ల అధికారులు అంత్యక్రియలు నిర్వహించారు.

'గద్దెనెక్కినంక' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా యువకవి కేపీ లక్ష్మీనరసింహ రచించిన 'గద్దెనెక్కినంక' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లాకేంద్రంలోని లుంబిని పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత వల్లభాపురం జనార్దన మాట్లాడుతూ లక్ష్మీనరసింహ రచించిన గద్దెనెక్కినంక పుస్తకంలో కవి మనువు సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థలోని లోపాలను ఆవిష్కరిస్తూ రచన చేశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహ కవిత్వం సమకాలీనతను ప్రతిబింబిస్తుందన్నారు. సమాజంలోని రుగ్మతలను అంశాలుగా తీసుకొని రచనలు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కె.లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కొందరు భ్రష్టు పట్టించడం దురదృష్టకరమని అన్నారు. డాక్టర్ పరిమళ్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహ కవిత్వంలో ఆవేదన, ఆక్రోశం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బెక్కెం జనార్దన్, వితలాపురం పుష్పలత, బోల యాదయ్య, పొన్నగంటి ప్రభాకర్, ఖాజామైనొద్దీన్, పులి జమున, కేవీఎల్ సత్యవతి, రావూరి వనజ, గుడిపల్లి నిరంజన్, వహీద్‌ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, ముచ్చర్ల దినకర్ పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

కోస్గి: అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. మండల కేంద్రం శివారులో శనివారం రాత్రి లోడ్‌చేసిన బియ్యంతో వెళ్తున్న వాహనాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో 20 క్వింటాళ్ల తూకం ఉన్న 50 బస్తాల బియ్యం ఉన్నట్లు నిర్ధారించారు. పట్టుబడిన బియ్యాన్ని స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో అప్పగించి ధ్రువీకరణ తీసుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

ఇంజినీరింగ్, లా కళాశాలల ఏర్పాటు..

కల సాకారం



పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం

- పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు దిశగా అడుగులు
- ప్రతిపాదనలు పంపాలని సూచించిన ప్రభుత్వం
- భవనాలు, సిబ్బంది, పరికరాలు తదితర వాటిపై నివేదిక
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించే అవకాశం
- ఉపాధి, ఉద్యోగ ఆధారిత కోర్సులకు ప్రాధాన్యత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఇంజినీరింగ్, లా కళాశాలల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ఆయా కళాశాలల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుంచి పీయూ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో రెండు కళాశాలల ఏర్పాటు కల త్వరలోనే సాకారం కాబోతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ లా, ఇంజినీరింగ్ కళాశాలలు లేకపోవడంతో వాటిని ఏర్పాటు చేయాలని గత కొన్నిరోజులుగా పీయూలోని విద్యార్థి సంఘాలు పీయూలో రెండు కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టి.. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. మొదట ఇంజినీరింగ్ కళాశాల జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం భావించినప్పటికీ విద్యార్థి సంఘాల నుంచి వచ్చిన డిమాండ్ ఆధారంగా పీయూలో ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు కళాశాలల ఏర్పాటుకు దాదాపు రూ.150– 200 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపేందుకు అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు.

ఇప్పటికే బార్ కౌన్సిల్ అనుమతులు

ప్రభుత్వం నుంచి లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు సంకేతాలు రావడంతో అందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు రూపొందిస్తున్నారు. మొదట రెండు కళాశాలలకు భవనాలు అవసరమవుతాయి. లా కళాశాలలో కేవలం ఒక్క లా గ్రూపు మాత్రమే ఉండగా.. ఇందుకు సంబంధించి ఇప్పటికే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి డిపార్ట్‌మెంట్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. ఇక ఇంజినీరింగ్‌లో పలు కోర్సుల తరగతుల నిర్వహణకు గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు రెండు కళాశాలల్లో పని చేసేందుకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలి. వీరికి చెల్లించే వేతనాలు, ఇతర ఖర్చుల పూర్తి వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. త్వరలో వీటిని రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి పంపించనున్నారు.

ఆదేశాలు వచ్చాయి..



పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వాటికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. రెండు కళాశాలలు వస్తే ఉమ్మడి పాలమూరు విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– లక్ష్మీకాంత్ రాథోడ్, వైస్ చాన్స్‌లర్, పీయూ

విద్యార్థులకు మేలు..



యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు కోసం ప్రభుత్వం కోరిన వివరాలను సమర్పిస్తాం. పూర్తిస్థాయి వసతులతో పాటు రెగ్యులర్ ప్రతిపాదికన సిబ్బంది నియమించాలని కోరుతాం. కళాశాల ఏర్పాటు చేసే ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే కష్టాలు ఇక నుంచి తప్పుతాయి.

– మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, పీయూ

ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా..



పాలమూరు యూనివర్సిటీలో ఇంజినీరింగ్, లా కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలో చదివే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. న్యాక్ గ్రేడింగ్, రూసా నిధులు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రభుత్వం రూ.100 కోట్లు ఇచ్చింది. ఐటీటీ కళాశాలలకు నిధులు విడుదలయ్యాయి. పాలమూరు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నాం.

– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మహబూబ్‌నగర్

4 నుంచి 6 కోర్సులు..

లా కోర్సుకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉండగా ఉమ్మడి జిల్లాలో ఒక్క ప్రైవేట్ కళాశాలలో మినహా ఎక్కడా ఆ కోర్సు లేదు. దీంతోపాటు ఇంజినీరింగ్‌లో డాటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్, మెషిన్ లర్నింగ్ తదితర డిమాండ్ ఉన్న కోర్సుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించనున్నట్లు సమాచారం. సుమారు 4 నుంచి 6 కోర్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తుంది. విద్యార్థుల చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు వచ్చేలా డిమాండ్ ఉన్న వాటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేలా అధికారులు ముందుకెళ్తున్నారు.

మహిళలు నడిపే ఏకైక సాహిత్య సంస్థ



కాళోజీ పురస్కారం, పాకాల యశోదారెడ్డి సాహితీ పురస్కారాల ప్రదానం (ఫైల్)

- 2020లో తెలంగాణ మహిళా సాహిత్య సంస్థ ఏర్పాటు
- పలు పుస్తక ఆవిష్కరణలు, కవి సమ్మేళనాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థను 2020 ఫిబ్రవరి 7వ తేదీన జిల్లా కేంద్రానికి చెందిన పలువురు మహిళా రచయితలు కలిసి ఏర్పాటు చేశారు. మహిళలు నడుపుతున్న ఏకైక సాహిత్య సంస్థ ఇదే కావడం విశేషం. ఈ సంస్థ ద్వారా యువ రచయిత్రులు, కవయిత్రులకు తెలుగు సాహిత్యంలో ప్రోత్సహిస్తున్నారు. సంస్థకు అధ్యక్ష, కార్యదర్శులుగా రావూరి వనజ, శాంతారెడ్డి వ్యవహరిస్తున్నారు. సంస్థ ఆధ్వర్యంలో పలు పుస్తకావిష్కరణ, కవి సమ్మేళనాలు నిర్వహించారు. ప్రతి ఏడాది మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలు చేస్తున్న మహిళలకు 'స్త్రీ స్ఫూర్తి' పురస్కారాలతో సత్కరిస్తున్నారు. కరోనా మహమ్మారి వేళ కూడా జూమ్ మీటింగ్‌ల ద్వారా పలు కవి సమ్మేళనాలు నిర్వహించి పలువురి మన్ననలు పొందారు. విద్యార్థులకు పద్యంపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా పద్యకార్యశాల నిర్వహించారు. జిల్లాకు చెందిన సాహితీ దిగ్గజం డాక్టర్ పాకాల యశోదారెడ్డి జయంతితో తెలంగాణ బాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ జయంతిని నిర్వహించి పలువురు రచయిత్రులకు పురస్కారాలు అందజేస్తున్నారు. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నాలుగేళ్లలో పలువురు కవులు. రచయిత్రులు రచించిన 11 పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రముఖుల చేత పుస్తకాలను ఆవిష్కరింపజేశారు. 2023లో హైదరాబాద్‌లో పద్మాకర్ అవధానిచే శతవధానం నిర్వహించారు. ప్రముఖ రచయిత్రి చుక్కాయపల్లి శ్రీదేవిచే శతావధానం, పలు సార్లు అష్టావధానాలు నిర్వహించారు. గతేడాది ప్రముఖ సాహితీవేత్తలు కసిరెడ్డి వెంకటరెడ్డి, నలవోలు నర్సింహారెడ్డిలకు సంస్థ తరఫున ఉగాది పురస్కారాలు అందజేశారు. అదేవిధంగా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలు ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు పురస్కారాలతో సత్కరించారు. కాళోజీ సాహితీ పురస్కారాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి సభ్యులు డాక్టర్ నాలేశ్వరం శంకరంకు, పాకాల యశోధారెడ్డి సాహితీ పురస్కారాన్ని తెలంగాణ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ త్రివేణికి అందజేసి ఘనంగా సన్మానం చేశారు.

మరిన్ని సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తాం



సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలకు ప్రతి ఏడాది అందజేసే స్త్రీ స్ఫూర్తి పురస్కారాల కార్యక్రమాన్ని కొనసాగిస్తాం. సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తాం. కొత్త రచయిత్రులు, కవిత్వంపై ఆసక్తిగల విద్యార్థులను ప్రోత్సహిస్తాం.

– సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, శాంతారెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో యువత పాత్ర కీలకం



పార్టీలో చేరిన యువకులతో డీకే అరుణ

పాలమూరు: దేశం యొక్క యువత భవిష్యత్ బాగుండాలంటే నరేంద్రమోదీ మరోసారి ప్రధానమంత్రి కావాలని, ఇందుకోసం పార్లమెంట్ ఎన్నికల గెలుపులో యువత కీలకపాత్ర పోషించాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రం పద్మావతికాలనీలోని నివాసంలో ఆదివారం మహబూబ్‌నగర్, జడ్చర్ల, నవాబ్‌పేటకు చెందిన యువత బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. దేశ భవిష్యత్ కోరుకునే ప్రతిఒక్కరూ బీజేపీకి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లాకేంద్రంలోని వీరన్నపేటలో ఉన్న చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రామలింగేశ్వర ఆలయం సందర్శన

అడ్డాకుల: మూసాపేటలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. మూసాపేటకు చెందిన అన్వర్, నజియాబేగం కుమార్తె నాహిన్‌బేగం, చాకలి శ్రీనివాసులు కుమార్తె మనీషాలు కలిసి ఇటీవల చారిత్రాత్మక కట్టడాలపై జరిగిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న సందర్భంలో రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన చిత్రాలను గీశారు. విషయం తెలుసుకున్న ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధులు నాగేంద్రస్వామి, శ్రీధర్, బాలయ్య, రమేష్‌చంద్రలు ఆలయానికి వచ్చి పరిశీలించారు. ఆలయ చిత్రాలను గీసిన బాలికలను అభినందించారు. ఆలయ నిర్మాణ విశేషాలను తెలుసుకున్నారు.





నాహిన్‌బేగం, మనీషాలు కలిసి గీసిన ఆలయ చిత్రం,ఆలయం వద్ద ఇంపాక్ట్ ప్రతినిధులు